'రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే దేశాభివృద్ధి'



అబిడ్స్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలతో పాటు అన్నివర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నెరవేరుతుందన్నారు. న్యూ ఢిల్లీలో జరుగుతున్న ఇండియా కూటమి సమావేశంలో గోషామహల్ నుంచి ఆయన అనుచరులతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎలా అధికారంలోకి వచ్చిందో ఈ పార్లమెంట్ ఎన్నికల్లో భారతదేశ నలుమూలలా ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. దేశంలో పదేళ్లపాటు మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో పదేళ్లపాటు కేసీఆర్ ప్రభుత్వాలు ప్రజలను దోచుకుని నట్టేట ముంచాయని నిర్మల్‌కుమార్ యాదవ్ ఆరోపించారు.

నిబద్ధతతో జీవించే ప్రతి మనిషిలోనూ దైవత్వం ఉంటుంది



ప్రత్యేక పూజల్లో బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

గన్‌ఫౌండ్రీ: దాన గుణం, నిబద్ధతతో జీవించే ప్రతి మనిషిలోనూ దైవత్వం దాగి ఉంటుందని భగవాన్ శ్రీ రామదూత స్వామి అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రామదూత ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ వేణు దత్తాత్రేయ సువర్ణ లక్ష్మీదేవి దాంపత్య వ్రతం, ఆధ్యాత్మిక ధార్మిక సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనవసరమైన కోరికలతో, స్వార్థ చింతనతో కుటుంబాల్లో అశాంతి పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి మనిషి తాను జీవించి ఉన్నంత వరకు సాటివారికి సహాయ పడటంలో ముందుండాలని సూచించారు. అంతకు ముందు భక్తుల భజనలతో, భగవనామ స్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మాజీ మంత్రి ఈటల రాజేందర్, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిడిద భిక్షమయ్య గౌడ్, దాసోజి శ్రవణ్, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లను క్రమబద్ధీకరించాలి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ల్యాబ్ టెక్నీషియన్ సంఘం అధ్యక్షుడు కవ్వం లక్ష్మారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణలో వైద్య ఆరోగ్య కుటుంబ శాఖ ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వం లక్ష్మారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డిని కలిసి వారి సమస్యలను విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో 16 ఏళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్లుగా సేవలందిస్తున్నామని, కేవలం నామమాత్రం జీతాలతో పని చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం తమ క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అనేకమార్లు తమ సమస్యలు విన్నవించుకున్నా ఎలాంటి ప్రయోజనం కలుగలేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బూర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య పద్ధతులను వినియోగించుకోవాలి



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ తదితరులు

సుల్తాన్‌బజార్: వ్యాధులను సమర్థవంతంగా నిర్మూలించడానికి మెరుగైన వైద్య పద్ధతులను వినియోగించుకోవాలని కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.శంకర్ అన్నారు. కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి, ఉస్మానియా మెడికల్ కాలేజ్ విభాగాల సహకారంతో చెవి ఎముక శస్త్ర చికిత్స ద్వారా మెదడు, శిరస్సు కింది భాగాల్లో వ్యాధులు, గడ్డల శస్త్ర చికిత్సలకు సంబంధించి శిక్షణ, అవగాహన సదస్సు ఆదివారం కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి బెంగళూర్‌కు చెందిన వైద్య నిపుణులు సంపత్‌చంద్ర ప్రసాదరావు అధునాతన పద్ధతులపై ప్రదర్శన ఇచ్చారు. దాదాపు 150 మంది శస్త్ర చికిత్స నిపుణులు, పీజీ విద్యార్థులు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. క్లిష్టమైన వ్యాధులను సమర్థవంతంగా నిర్మూలించేందుకు ఈ పద్ధతులు ఉపయోగపడే అవకాశం ఉందని సదస్సు సంచాలకులు డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ ఆచార్య, ఎల్.సుదర్శన్‌రెడ్డి, కరుణ, అమీద్, సత్యకిరణ్, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్రకుమార్ ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ తఖియుద్దీన్, అభిజిత్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలి



ప్రదర్శనలో పోల్కం శ్రీనివాస్ తదితరులు

అబిడ్స్: చట్ట సభల్లో, రాజ్య సభలో ఎమ్మెల్సీ, ఎంపీల కేటాయింపులో మేరు కులస్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మేరు యువజన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. అన్ని చట్ట సభల్లో తెలంగాణ రాష్ట్రంలో లక్షల జనాభా ఉన్న మేరు కులస్తులకు పదవులు కేటాయించాలని ఆయన అన్నారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గేను కలిసేందుకు పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోల్కం వినయ్ రాజ్, ఆదిమూలం శంకర్, గంగాపురం దశరథ్, గోపాల్‌రెడ్డి మలిక్ తదితరులు న్యూ ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..రాజ్యసభలో, శాసన మండలిలో, ఇతర కార్పొరేషన్ పదవుల్లో తమకు సరైన ప్రోత్సహం ఇవ్వాలని అయన అన్నారు. తమ నాయకులంతా కలిసి మల్లికార్జున్ ఖార్గేకు మెమోరాండం అందజేస్తామని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మేరు కులస్తులకు న్యాయం జరుగుతుందని పోల్కం శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



చార్మినార్ కట్టడం వద్ద సందర్శకుల సందడి

చార్మినార్: పాతబస్తీ చార్మినార్ పరిసరాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కళకళలాడాయి. చార్మినార్ కట్టడం వద్ద రోజంతా పర్యాటకుల సందడి కనిపించింది. ఎండను సైతం లెక్క చేయని సందర్శకులు అధిక సంఖ్యలో పాతబస్తీలోని పర్యాటక స్థలాలను సందర్శించారు. పర్యాటకుల సంఖ్య పెరగడంతో చిరు వ్యాపారాలు కూడా జోరుగా కొనసాగాయి.

కోటకు పర్యాటక శోభ..

గోల్కొండ: మండే ఎండలో సైతం గోల్కొండ కోట పర్యాటక శోభను సంతరించుకుంది. ఆదివారం గోల్కొండ కోటకు వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచే కోట బుక్కింగ్ కౌంటర్ ముందు పర్యాటకులు బారులు తీరారు. ఈ ఆదివారం కోటకు వచ్చిన పర్యాటకులలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. చాలా మంది టూరిస్టు బస్సులలో తరలి వచ్చారు. కోట దిగిన పర్యాటకులు నగినాబాగ్‌లోని పచ్చని చెట్ల నీడన సేదతీరారు.



గోల్కొండ కోటలో పర్యాటకులు

కంటికి తేజస్సునిచ్చే సుర్మా..

రంజాన్‌లో సుర్మాకు ప్రత్యేకత



మక్కా మసీదు వద్ద ముస్లిం సోదరుని కళ్లకు సుర్మా పెడుతున్న దృశ్యం

చార్మినార్: రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు 'సుర్మా 'ను విరివిగా వినియోగిస్తున్నారు. ప్రతిరోజూ రెండు కళ్లకు ఈ సుర్మాను పెట్టుకుంటారు. ప్రవక్త మూసా అలైహి సలాం సుర్మాను వాడారు కాబట్టి ముస్లిం సోదరులు దీనిని సున్నత్‌గా భావించి రంజాన్ మాసంలో వాడుతున్నారు. అంతేకాకుండా కంటికి తేజస్సుతో పాటు చలువదనాన్ని కూడా అందజేస్తున్నందున ప్రస్తుతం ముస్లిం సోదరులు ఎక్కువగా వాడుతున్నారు. జీవిత కాలంలో కనీసం ఒక తులం సుర్మాను తప్పనిసరిగా వాడాల్సి ఉంటుందని..అందుకే రంజాన్ మాసంలో సుర్మా వినియోగం ఎక్కువగా ఉంటుందని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు. దుకాణంలో కేవలం ఒక్క రూపాయికి రెండు కళ్లకు ఈ సుర్మాను పెడతారంటున్నారు. నల్లగా ఉండే ఈ సుర్మా పెట్టడంతో కళ్లు కొట్టొచ్చినట్లు అందంగా కనిపిస్తాయి. గల్ఫ్ దేశంలోని మరాఖిష్ ప్రాంతంలోని కోహితూర్ పర్వతం భస్మీపటలం కావడంతో అక్కడి భూమి నల్లగా మారిందని..అక్కడికెళ్లిన ప్రవక్త మూసా అలైహి సలాం నల్లటి పౌడర్‌ను వేలితో తీసుకొని కళ్లకు పెట్టుకున్నారని చెబుతున్నారు. అప్పటి నుంచి మహ్మద్ ప్రవక్త వరకు ఈ సుర్మాను వాడారంటున్నారు.

పర్వతాల నుంచి నల్లటి రాళ్లను సేకరించి..

ప్రస్తుతం దగ్గరలో ఉన్న పర్వతాల వద్దకు వెళ్లి నల్లటి రాళ్లను సేకరించి సుర్మా తయారు చేస్తున్నారు. రాళ్లను పగులగొట్టి పౌడర్‌గా మారుస్తున్నారు. ఈ పౌడర్‌కు గులాబీ నీరు కలిపి సుర్మాను తయారు చేస్తున్నారు. పాతబస్తీకి చెందిన అతికొద్ది మంది మాత్రమే ఈ సుర్మా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. తమ తాతముత్తాలు తరతరాలుగా ఈ సుర్మా వ్యాపారంలో ఉన్నందున తాము కూడా రంజాన్‌లో ఈ వ్యాపారం చేస్తున్నామని కొంత మంది వివరించారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేసిన లక్ష్మణ్‌రావు గుప్తా, మహేందర్

జియాగూడ: ఆలయాలను సందర్శించి హైందవ సనాతన ధర్మం విశిష్టతను తెలుసుకోవాలని బజరంగ్‌సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్ రావు గుప్తా అన్నారు. ఆదివారం జియాగూడ ఇమాంపురాలో గల చారిత్రక శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఇమాంపురా శ్రీ పంచముఖి హనుమాన్ సేవాదళ్ అధ్యక్షులు గుండ్రపల్లి మహేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సూర్యశుక్లా, కాశాధికారి పవన్ ఇందోరియ తదితరులు పాల్గొన్నారు.

'పాత నగరాన్ని కొత్త నగరంగా తీర్చిదిద్దుకుందాం'



బాపూఘాట్‌లో మార్నింగ్ వాక్‌లో మాధవీలత

లంగర్‌హౌస్: మన పాత నగరాన్ని కొత్త నగరంగా తీర్చిదిద్దుకుందామని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని మాధవీలత అన్నారు. ఆదివారం ఉదయం ఆమె లంగర్‌హౌస్ బాపూఘాట్‌లో పర్యటించారు. అక్కడ మార్నింగ్ వాక్ చేస్తూ, భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా కేంద్రంలో యోగా చేస్తున్న వారితో గడిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు..పాతబస్తీ వాసులు మార్పు కోరుకుంటున్నారని బీజేపీ వల్లనే అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నారన్నారు. అందరం ఐకమత్యంతో బీజేపీని గెలిపించి పాత నగరాన్ని కొత్త నగరంగా తీర్చిదిద్దుకుందామన్నారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ ఉదయ్ కుమార్, డాక్టర్ శివకుమార్, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, లంగర్‌హౌస్ డివిజన్ అధ్యక్షుడు నాగేంద్రప్రకాష్ రెడ్డి ఉన్నారు.

'లైన్‌మెన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్ డివిజన్ నౌ నంబర్‌లో ఆదివారం ఉదయం 6 గంటలకు వాటర్ వర్క్స్ లైన్‌మెన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. డైరీ ఫామ్ పిల్లర్ నంబర్ 207 వద్ద రెండు రోజుల కింద కార్మికులపై జరిగిన దాడి ఘటన మరువకముందే అదే సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలో ఆదివారం 6 గంటలకు వాటర్ లైన్‌మెన్ పి.జగదీష్ వాటర్ లైన్‌ను వదలడం జరిగిందన్నారు. రోడ్డు మీద వాటర్ వృథాగా కడుగుతుంటే పలుమార్లు వృథా చేయొద్దని చెప్పారు. అయినా కూడా అదే విధంగా నీళ్లను వృథాగా చేస్తుంటే చేయొద్దని ఫొటో తీస్తుంటే వాటర్ లైన్‌మెన్ ఫోన్ లాక్కొని దాడి చేయడం జరిగిందన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఇలాంటి దాడులు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని.. లేదంటే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ వర్క్స్, మలేరియా తదితర విభాగాల్లో పని చేసే కార్మికులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామన్నారు.

కార్పొరేటర్‌కు ఆహ్వానం

రాజేంద్రనగర్: బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్‌ని కలిసి ఆహ్వానం అందజేశారు. ఆమెను కలిసిన వారిలో పోయిల జీవన్ దాస్, టీ.ఆర్.శ్రీరాములు, కోరని దయానంద్, గోల్కొండ రాజ్ కుమార్, పంబాల రాజు, బాబురావు, ప్రీతం రాజ్, తలారి రాజ్ కుమార్, బర్ల సుమన్ పాల్గొన్నారు.

మజ్లిస్‌ను చిత్తుగా ఓడిస్తాం: సోమరాజ్ సింగ్



బీజేపీ అభ్యర్థి మాధవీలతను సత్కరిస్తున్న సోమరాజ్ సింగ్ తదితరులు

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్లో మజ్లిస్ పార్టీని చిత్తుగా ఓడించి సత్తా చాటుతామని గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ సోమరాజు ఆదివారం పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్ కాంగ్రెస్‌లు కుమ్మక్కయ్యామన్నారు. రెండు పార్టీలు ప్రజలను మోసం చేసినందుకు సిద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. మజ్లిస్, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలతను ఆయన ఘనంగా సత్కరించారు. పలు ప్రాంతాల్లో పర్యటించి బీజేపీని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం సోమ రాజ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ పథకాలతో మాధవీలత విజయం ఖాయం అయిందన్నారు. మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఏనాడు హైదరాబాద్ అభివృద్ధి చేపట్టలేదన్నారు. మైనారీల ఓట్లతో అధికారంలోకి వస్తున్న మజ్లిస్ పార్టీ కేవలం తమ సొంత ప్రయోజ నాలకు పలు పడుతుందన్నారు. మైనార్టీల సంక్షేమం కూడా ఏనాడు మజ్లిస్ చూడలేదన్నారు.

రంజాన్ తరావీ ప్రార్థనలతో దైవ కృప



మౌలానా ఖారీ మహ్మద్ ఇస్మాయిల్‌తో మజీద్ కమిటీ ప్రతినిధులు

గోల్కొండ: తరవీ ప్రార్థనలు కేవలం రంజాన్ మాసంలోనే జరుగుతాయని తరావీ ప్రార్థనల్లో పాల్గొన్న వారు దైవ కృపకు పాత్రులవుతారని సెవన్ టూమ్స్ చౌరస్తా వద్ద గల కుతుబ్‌షాహి మజీదు నిర్వహక కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్ అన్నారు. కుతుబ్‌షాహి మజీదులో ఆదివారం తరావీ ప్రార్థనలు ముగిసిన సందర్భంగా తరావీ ప్రార్థనలకు ఆధ్వర్యం వహించిన మౌలానా ఖారీ మహ్మద్ ఇస్మాయిల్‌ను తరావీ ప్రార్థనలు పూర్తయిన సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా ఈ మసీదులో తరావీ ప్రార్థనలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. తన శ్రావ్యమైన కంఠంతో ఖారీ మహ్మద్ ఇస్మాయిల్ తరావీ ప్రార్థనల్లో పవిత్ర ఖురాన్ గ్రంథ పఠాన్ని గావిస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తరావీలు చదివించిన మహ్మద్ ఇస్మాయిల్‌కు మసీదు కమిటీ తరఫున ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం కార్వాన్ నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు ఆయనను టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఒక్కొక్కరి సమస్యలను విన్నారు. సమస్యల పరిష్కరించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తమ తమ ప్రాంతాల్లోని సమస్యలను తన దృష్టికి తేస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తానన్నారు. తరచూ తాను స్వయంగా ఉన్నతాధికారుల కార్యాలయాలకు వెళ్లి కార్వాన్ నియోజకవర్గ సమస్యలను వివరిస్తున్నానన్నారు. అంతేకాకుండా అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి వివిధ అంశాలపై చర్చిస్తున్నానన్నారు. ప్రస్తుతం తాగునీటి సరఫరా ఒక్కటే ప్రధాన అంశం అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎక్కడా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తలేదన్నారు.

'రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది'



సమావేశంలో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని సీనియర్ మజ్లిస్ నాయకుడు, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆదివారం టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో ఆయన రంజాన్ ఇఫ్తార్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇఫ్తార్ ప్రత్యేకతలను మరోసారి తెలియజేసేందుకు తాను ఏప్రిల్ 5న గోల్కొండ రిసాలబజార్‌లోని ఒవైసీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఇఫ్తార్ పార్టీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విందులో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన అన్నారు. ఇఫ్తార్‌కు ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ ఆధ్వర్యం వహిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఖాలేద్ ఆలీఖాన్, సయ్యద్ ఖాజా తదితరులున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో ఆయన పాల్గొన్నారు. 100 మంది పోలీసులతో కలిసి నిర్వహించిన ఈ సెర్చ్‌లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు, మూడు కార్టన్ల బీర్లు, పది లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల తమ ప్రవర్తన మార్చుకోని యెడల పీడీ యాక్టులు నమోదు చేస్తామన్నారు. అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక డివిజన్ ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జాతీయ సాహిత్య పరిషత్ భాగ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో రచయిత్రి డాక్టర్ సరోజన బండ రచించిన 'వాచకాలు మన వారసత్వ సంపద'పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ పూర్వ అధ్యక్షుడు బీఎస్. రాములు మాట్లాడుతూ..తెలుగు వాచకాలపై మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి సునీత భగవత్, పాఠశాల విద్య ఆర్‌జేడీ విజయలక్ష్మి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, వెలిదండి శ్రీధర్, అపర్ణ, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌లోకి వలసవాదులు వచ్చారు..వెళ్లారు'



సమావేశంలో బీఆర్‌ఎస్ ఉద్యమకారులు

జియాగూడ: బీఆర్‌ఎస్ పార్టీలోకి వలసవాదులు వచ్చారు, వెళ్లారు. తెలంగాణ ఉద్యమకారులు మాత్రం నేటికీ పార్టీకి వెన్నంటి ఉన్నారని కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్, అధ్యక్షుడు బి.నరహరి చారి, శ్రీనివాస్ గుప్తా, ఇన్‌చార్జి మంతటి నర్సింహ, జడల మోహన్, రఘునాథ్ అన్నారు. ఆదివారం జియాగూడ కేశవస్వామినగర్‌లో ఉద్యమకారులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వలసవాదులకు పదవులు, పార్టీ టికెట్లు ఇచ్చి ఆదరించిందన్నారు. వలసవాదులు మాత్రం వ్యాపారాలు, స్వప్రయోజనాల కోసం పార్టీని వీడారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహేష్‌గౌడ్, పాలెం వెంకటేష్, కె.నర్సింగ్‌రావు, శివ, అనిత, అరుణ, వినోద్‌కుమార్, మనోజ్‌కుమార్, రాజేంద్రకుమార్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

ఆయుర్వేద పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు అతిథులు

గన్‌ఫౌండ్రీ: మనం నిత్యం చూసే పలు ప్రకృతి ప్రసాదించిన మూలికలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పలువురు ప్రముఖులు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో సైన్స్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి మా బ్రహ్మానందమై రచించిన 'సెల్ఫ్ హెల్ప్ ఆయుర్వేద్ ఫర్ ఆల్'పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమ నాగినేని మాట్లాడుతూ..అనేక ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదంలో పరిష్కారాలు ఉన్నాయని ప్రపంచ వ్యాప్తంగా ఆయుర్వేద వైద్యం పట్ల ఆదరణ పెరుగుతుందని తెలిపారు. భారతీయ సనాతన వైద్య ప్రక్రియలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్‌లేని సుగుణాలు కలిగిన మందులు ఆయుర్వేదానికి ఉన్న ప్రత్యేకత అన్నారు. అంతకు ముందు శ్రీ సచ్చిదానంద కళాపీఠం చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు జేబీ.లక్ష్మణ్, సంస్థ చైర్మన్ మృత్యుంజయ గౌడ్, కళాపీఠం అధ్యక్షులు రత్నాకర శర్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కార్యకర్తల సమష్టి కృషితోనే విజయం సాధ్యం



మాధవీలతను సన్మానిస్తున్న ఆది జాంభవ సంక్షేమ సంక్షేమం ప్రతినిధులు

జియాగూడ: హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తల సమష్టి కృషితోనే విజయం సాధ్యమని బీజేపీ లోక్‌సభ అభ్యర్థి మాధవీలత అన్నారు. ఆదివారం జియాగూడలోని ఇందిరానగర్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ..బీజేపీకి కార్వాన్ నియోజకవర్గంలోనే అత్యధిక ఓటు బ్యాంకు జియాగూడ నుంచి లభిస్తుదన్నారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని ఈసారి గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ఆది జాంభవ సంక్షేమ సంఘం సభ్యులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా పాల ఉత్పత్తుల కన్వీనర్ బి.శివకుమార్ యాదవ్, దర్పల్లి నర్సింహ, డిజ్వర్ సింగ్, కె.గోవర్ధన్, ముచ్చింతల సత్యనారాయణ, రాజేందర్, కేశవ్, సురేష్, రఘుపతి, ఎం.బాలకృష్ణ, పాలెం వెంకటేష్, దొర్నల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా మత్స్యకారుల సంక్షేమానికి కృషి



సమావేశంలో రాష్ట్ర మత్స్యకార సహకారాల సంఘాల చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: మహిళా మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలంగాణ మత్స్యకార సహకార సంఘాల సమైక్య చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. మహిళా మత్స్యకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మహిళా మత్స్యకారుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. మహిళా శక్తితోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా మత్స్యకారుల కోసం పలు విధాల ప్రణాళికలు రూపొందించి తమ ప్రభుత్వం వారి వికాసానికి ముందుంటామన్నారు. గత పదేళ్లపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యశాఖ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని పేర్కొన్నారు.